

ఓటు హక్కుపై ప్రచారం చేసే వాహనం

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

# ఓటేద్దాం..

- ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో విస్తృత ప్రచారం
- 80 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం
- మహిళలు, దివ్యాంగులు, కొత్త ఓటర్లకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- పతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఈవీఎం డెమో స్టేషన్ కేంద్రాల ఏర్పాటు
- ఓటు బదిలీ, కొత్త ఓటు నమోదుకు నేడే ఆఖరు


రంగారెడ్డి, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): నవంబర్ 30న జరిగే శాసనసభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. అందులో భాగంగానే రంగారెడ్డి జిల్లా అధికార యంత్రాంగం కూడా ఓటు హక్కు వినియోగంపై విస్తృత ప్రచారం చేస్తున్నది. సంచార రథాల(మొబైల్ వాహనాలు) ద్వారా ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఈవీఎం డెమో స్టేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి పనితీరుపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. మరోపక్క మహిళలు, దివ్యాంగులు, కొత్త ఓటర్లకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను సైతం ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 33,56,056 మంది ఉండగా..ఈ నెలాఖరు వరకు ఓటు బదిలీ, కొత్త ఓటు నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఆయా ఓటర్లకు రానున్న ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం దక్కనున్నది. ఎన్నికల్లో గ్రామీణులే ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. అక్షరాస్యులు, విద్యాధికులు, ఉద్యోగాలు చేసేవారు ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదు అవుతుండడం కలవరపరుస్తున్నది. ఈ పరిస్థితుల నేపథ్యంలో పోలింగ్ శాతం పెంపు కోసం అధికార యంత్రాంగం ఎన్నికలకు నెల రోజుల ముందు నుంచే కసరత్తును మొదలు పెట్టింది. యువతలోనూ ఓటింగ్‌పై ఆసక్తి పెంపొందేలా ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నది. జిల్లా కలెక్టర్ భారతి హోలీకేరీ ప్రత్యేక దృష్టి పెట్టి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలను చేపడుతున్నారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గానికీ ఒకటి చొప్పున సంచార రథాన్ని అందుబాటులోకి తెచ్చారు. గ్రామగ్రామాన ప్రచారం నిర్వహించి ఓటింగ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. అలాగే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం) పనితీరుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వీలుగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో ఈవీఎం డెమో స్టేషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌ల పనితీరుపై ఏవైనా సందేహాలు ఉంటే ఈ కేంద్రాలలో నివృత్తి చేసుకునేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## సంచార రథాలను ప్రారంభించిన కలెక్టర్..

ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన సంచార రథాలను సోమవారం జిల్లా కలెక్టర్ హోలీకేరీ కలెక్టరేట్‌లో జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఓటు హక్కుపై చైతన్యం కల్పించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే సంచార రథాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జడ్పీ సీఈవో దిలీప్ కుమార్, డీఆర్డీవో పీడీ, స్వీప్ నోడల్ అధికారి ప్రభాకర్, ఆర్డీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మాడల్ పోలింగ్ కేంద్రాలు..

ఈసారి ఎన్నికల కమిషన్ వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కల్పించింది. జిల్లా వ్యాప్తంగా 80 ఏండ్లు దాటిన వృద్ధులు 43,541 మంది ఉన్నారు. వీరిలో కదలలేని స్థితిలో ఉన్న వారికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు. ఎన్నికలకు వారం రోజుల ముందుగా వారికి 12డీ ఫారం ఇచ్చి మొబైల్ టీం పరిశీలించిన తర్వాత ఓటు హక్కుకు అవకాశం కల్పించనున్నారు. అలాగే గతంలో కేవలం మహిళలు, దివ్యాంగులకు మాత్రమే ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఈసారి యువతకు కూడా మాడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో కొత్త ఓటర్లు 66,359 మంది ఉన్నట్లు గుర్తించారు. అక్టోబర్ 31 నాటికి కొత్తగా ఓటు నమోదుకు, బదిలీకి ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో యువతకు జిల్లాలో 52 మాడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మహిళలకు ప్రత్యేకంగా 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పా టు చేస్తున్నారు. జిల్లాలో దివ్యాంగులు 45,200 మంది, దృష్టి, మూగ, చెవిటి లోపం ఉన్నవారు 48,603 మంది ఉన్నారు. వీరి కోసం 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.


కొంగరకలాన్‌లో ఏర్పాటైన రంగారెడ్డి కలెక్టరేట్

# 'పట్నం'లో.. గులాబీ పాగా..

- ఉద్యమాల గడ్డపై అభివృద్ధి పరుగులు
- సబ్బండ వర్ణాలకు సంక్షేమ ఫలాలు
- పరిశ్రమలకు కేరాఫ్‌గా ఆదిబట్ల, కొంగరకలాన్
- ఐదేండ్లలో అక్షరాల రూ.2,931కోట్ల అభివృద్ధి
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో మారిన నియోజకవర్గ రూపురేఖలు
- హ్యాట్రిక్ కొట్టిన మంచిరెడ్డికి మరోసారి జైకొట్టేందుకు సిద్ధమవుతున్న ప్రజలు



ఆదిబట్లలోని టీసీఎస్ కంపెనీ


ఇబ్రహీంపట్నం చెరువు

రంగారెడ్డి, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ) : ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పోరాటాలకు పెట్టింది పేరు. ఈ నియోజకవర్గం వేదికగా నిజాం వ్యతిరేక పోరాటాలు, సాయుధ తెలంగాణ పోరాటాలెన్నో పురుడుపోసుకున్నాయి. ఒకప్పుడు మావోయిస్టు కార్యకలాపాలు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో నేడు పారిశ్రామిక ప్రగతి వెల్లివిరుస్తున్నది. దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ కంపెనీలు ఇక్కడకు తరలివస్తుండడంతో ఈ నియోజకవర్గం పేరు మరింత ప్రాచుర్యం పొందింది. 2009 నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి వరుసగా ఎమ్మెల్యేగా గెలుస్తూ వస్తున్నారు. సంక్షేమ పరంగానే గాకుండా ప్రగతిపథంలోనూ దూసుకుపోతున్నది. ఈ సెగ్మెంట్ పరిధిలోని కొంగరకలాన్‌లో రంగారెడ్డి కలెక్టరేట్ ఏర్పాటుకాగా.. రహదారుల విస్తరణ, అన్నిరకాల మౌలిక వసతులు పల్లెపల్లెకూ చేరాయి. గతంతో పోలిస్తే అన్ని రంగాల్లోనూ ఈ నియోజకవర్గంలో సమూల మార్పులు జరిగి గణనీయమైన ప్రగతి కనిపిస్తున్నది. ఇప్పటికే మూడు సార్లు గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ప్రత్యేక గుర్తింపు పొందిన మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఈసారి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలబడి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రజానీకం సైతం మరోసారి మంచిరెడ్డిని గెలిపించేందుకు సిద్ధమవుతున్నారు.


మంచాల మండలంలోని పటేల్ చెరువు తండాలో భగీరథ నీటిని పట్టుకుంటున్న గిరిజన మహిళ

సబ్బండ వర్ణాల సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నియోజకవర్గంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. నియోజకవర్గంలో వృద్ధులు 12,024 మందికి, వితంతువులు 11,886 మందికి, దివ్యాంగులు 5,693 మందికి, చేనేత కార్మికులు 94 మందికి, గీత కార్మికులు 1,030 మందికి, ఒంటరి మహిళలు 554 మందికి పింఛన్లను ప్రభుత్వం ప్రతినెలా పంపిణీ చేస్తున్నది. 9,011 మందికి రూ.11.39 కోట్లను వెచ్చించి కేసీఆర్ కిట్లను అందించింది. రైతుబంధు సాయంగా 58,980

## గడపగడపకూ సంక్షేమం..

మంది రైతులకు 2018 నుంచి రూ.890 కోట్లను ఇవ్వడం జరిగింది. 702 మంది రైతు కుటుంబాలకు రైతు బీమా కింద రూ.5 లక్షల చొప్పున రూ.35.10 కోట్ల సాయాన్ని అందించింది. లక్ష లోపు రుణాలను 20,488 మంది రైతులకు రూ.105.75 కోట్లను ప్రభుత్వం మాఫీ చేసింది. స్వయం సహాయక మహిళా గ్రూపుల్లోని 66,693 మంది మహిళా సభ్యులకు రూ.1,039 కోట్ల రుణాలను బ్యాంకు లింకేజీ ద్వారా అందించడం జరిగింది. రూ.36.29 కోట్ల మేర వడ్డీలేని రుణాలను అందించగా..స్త్రీ నిధి కింద రూ.218.67 కోట్లను అందించి స్వయం ఉపాధికి తోడ్పాటునందించారు. గడపగడపకూ అందిన సంక్షేమ పథకాలతో నియోజకవర్గ ప్రజానీకం మంచిరెడ్డి అభ్యర్థిత్వానికి జై కొడుతున్నది.

## ఐదేండ్లలో రూ.2,931కోట్లతో అభివృద్ధి..

ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ఈ నియోజకవర్గ రూపురేఖలు స్వరాష్ట్రంలో పూర్తిగా మారిపోయాయి. నియోజకవర్గ అభివృద్ధికి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపడం.. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కృషితో సెగ్మెంట్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించింది. ఐదేండ్లకాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గాభివృద్ధికోసం అక్షరాలా రూ.2,931కోట్లను ఖర్చుచేసింది. ఇబ్రహీంపట్నం దవాఖానను 30 పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయడంతోపాటు డయాలసిస్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చి ఖరీదైన వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నది. అదేవిధంగా యాచారం దవాఖానను 50 పడకలకు అప్‌గ్రేడ్ చేయడంతో కొత్తగా 12 బస్తీ దవాఖానలు, 6 పల్లె దవాఖానలను ఏర్పాటుచేసి అన్నివర్గాల ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని చేరువ చేసింది. మిషన్ కాకతీయలో 126 చెరువులను రూ.86.81కోట్లతో అభివృద్ధి చేసింది. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మాసాబ్‌చెరువును రూ.2.5కోట్ల హెచ్ఎండీఏ నిధులతో ఆధునీకరించింది. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువును సైతం రూ.18.64 కోట్లతో నవీ కరించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక్కడ పార్కులు, రెస్టారెంట్లు, బోటింగ్, వాకింగ్ ట్రాక్‌లను అందుబాటులోకి తెచ్చి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలను సిద్ధం చేసింది. రూ.533కోట్లను వెచ్చించి మిషన్ భగీరథ పథకం ద్వారా గడపగడపకూ తాగునీటిని అందిస్తున్నది. హస్తినాపురంలో ఉన్న ఆర్టీఏ కార్యాలయాన్ని మన్నెగూడకు తీసుకురావడంతో ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో దోహదపడింది. అదేవిధంగా రూ.10కోట్లతో సాగర్ హైవేపు బొంగుళూరు నుంచి ఇబ్రహీంపట్నం వరకు, యాచారం, మంచాల, మాల్‌లలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసింది. రూ.914కోట్లతో డబుల్, నాలుగు లేన్ల రహదారులను ఏర్పాటు చేయడంతోపాటు అనేక ప్రాంతాలకు కొత్త రోడ్లను వేయడంతో రవాణా సౌకర్యం మెరుగుపడింది. కొత్తపేటలో ఉన్న గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్‌ను అబ్దుల్లాపూర్ మెట్‌కు తరలించగా విజయవంతంగా కొనసాగుతున్నది. కొహెడలో 178 ఎకరాల విస్తీర్ణంలో ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్ ఏర్పాటుకు కార్యాచరణ సైతం మొదలైంది. రూ.6.90 కోట్లను వెచ్చించి 23 రైతు వేదికలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.


తుర్కయాంజాల్‌లో సుందరీకరణతో సర్వాంగ సుందరంగా మారిన మాసాబ్ చెరువు


ఫాక్స్‌కాన్ కంపెనీ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి కేటీఆర్(ఫైల్)

## 173 పరిశ్రమలు.. రూ. 6,982 కోట్ల పెట్టుబడులు..

నియోజకవర్గ వేదికగా ఆదిబట్ల, కొంగరకలాన్ ప్రాంతాల్లో పరిశ్రమల ప్రభ వెల్లివిరుస్తున్నది. 2014 నుంచి టీఎస్-ఐపాస్ అనుమతులతో 173 పరిశ్రమలు రూ.6,982.85 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటై 8,274 మందికి ఉపాధి కల్పించాయి. టాటా బోయింగ్, టాటా సికోర్‌స్కి, టాటా లాక్‌హీడ్ మార్టిన్ కంపెనీలకు చెందిన ఏరోస్పేస్ వస్తువుల ఉత్పత్తి పరిశ్రమలు ఏర్పాటై ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి. ఎలిమినేడులో ఏరోస్పేస్ విమానాల విడిభాగాల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానుండగా.. కొంగరకలాన్‌లో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి రంగంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఫాక్స్‌కాన్ సంస్థ భారీ పెట్టుబడితో ప్లాంట్‌ను నెలకొల్పుతున్నది. ప్రస్తుతం నిర్మాణ పనులు వేగంగా సాగుతుండగా..ఈ కంపెనీతో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. బొంగుళూరు, బాటసింగారం వద్ద లాజిస్టిక్ పార్కులు ఏర్పాటయ్యాయి. యాచారం, కందుకూరు మండలాల పరిధిలో 19,333 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటవుతున్న ఫార్మాసిటీతో 5 లక్షల ఉద్యోగాలు రానున్నాయి. ఖాల్సా గ్రామంలో 123 ఎకరాల్లో ఫైబర్ గ్లాస్ కాంపోజిట్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించి 43 కంపెనీలకు భూమిని కేటాయించింది. రూ.55.67 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేసే ఈ కం పెనీలతో 30వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఔటర్ రింగు రోడ్డుకు ఈ ప్రాంతం దగ్గరగా ఉండడం వంటి అనుకూలతల కారణంగా పారిశ్రామిక వేత్తలు ఇబ్రహీంపట్నం వైపుగా పరిశ్రమలను ఏర్పాటు కు ఆసక్తి చూపుతున్నారు.




## హ్యాట్రిక్ కొట్టిన మంచిరెడ్డి..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం 1952లో ఏర్పాటుకాగా..ఇప్పటివరకు ఈ సెగ్మెంట్‌లో 16 సార్లు ఎన్నికలు జరిగాయి. 1952 నుంచి 1972 వరకు జనరల్‌గాను 1978 నుంచి 2004 వరకు రిజర్వుడుగా ఉన్న ఈ నియోజకవర్గం 2009లో తిరిగి జనరల్‌గా మారింది. కాంగ్రెస్ పార్టీ చివరగా 1983లో గెలవగా ఆ తర్వాత నుంచి ఈ పార్టీకి గెలుపు అనేది అందని ద్రాక్షగా మారింది. టీడీపీ నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రెండుసార్లు గెలుపొందారు. ఆ తర్వాత 2018లో బీఆర్ఎస్ తరపున పోటీచేసి గెలుపొంది హ్యాట్రిక్ కొట్టారు. నాలుగోసారి కూడా ఈ నియోజకవర్గ ప్రజలు తనకే పట్టం కడతారని ఆయన ధీమావ్యక్తం చేస్తున్నారు.

### గత మూడు టర్మ్‌లలో మంచిరెడ్డి సాధించిన ఓట్లు

| ఏడాది | సాధించిన ఓట్లు | శాతం |
|---|---|---|
| 2009 | 56,508 | 36.54 |
| 2014 | 48,397 | 26.67 |
| 2018 | 72,581 | 36.87 |



## ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఓటర్లు.. 3,10,756 మంది

నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,10,756 మంది కాగా ఇందులో సగానికి పైగా ఓటర్లు అబ్దుల్లాపూర్‌మెట్, పెద్ద అంబర్‌పేట, తుర్కయాంజాల్ ప్రాంతాలల్లోనే ఉన్నారు. ఈ మూడు ప్రాంతాల ఓటర్లే అభ్యర్థుల గెలుపు ఓటములను ప్రభావితం చేస్తున్నారు.

| | |
|---|---|
| పురుషులు | 1,57,804 మంది |
| స్త్రీలు | 1,52,923 మంది |
| థర్డ్ జెండర్స్ | 29 మంది |
| పోలింగ్ స్టేషన్లు | 319 |

### వయసుల వారీగా ఓటర్లు ఇలా..

| | |
|---|---|
| 19-39 ఏండ్లు | 1,67,280 మంది |
| 40-59 ఏండు | 1,04,664 మంది |
| 60-99 ఏండ్లు | 38,681 మంది |
| వంద ఏండ్లకు పైబడి | 61 మంది |

## మండలాలు.. మున్సిపాలిటీలు

మండలాలు : ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్

మున్సిపాలిటీలు : ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, తుర్కయాంజాల్, పెద్దఅంబర్‌పేట

| | |
|---|---|
| జనాభా | 2,75,417 మంది |
| గ్రామీణ జనాభా | 76శాతం |
| పట్టణ జనాభా | 24శాతం |
| ఎస్సీ జనాభా | 20.74శాతం |
| ఎస్టీ జనాభా | 7.55 శాతం |
| మైనార్టీ జనాభా | 4 శాతం |
| అక్షరాస్యత శాతం | 66శాతం |


ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని సన్మానించిన ఆర్ఎంపీ వైద్యులు

## మంచిరెడ్డికి మద్దతుగా కదులుతున్న సంఘాలు

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి వివిధ సంఘాల నుంచి స్వచ్ఛందంగా మద్దతు లభిస్తున్నది. నియోజకవర్గ అభివృద్ధి మంచిరెడ్డితోనే సాధ్యమని భావించిన అనేక సంఘాల సభ్యులు సంపూర్ణ మద్దతును అందిస్తున్నారు. సోమవారం మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేసి విస్తృతంగా ప్రచారం చేశారు. నియోజకవర్గంలోని ఆర్ఎంపీ వైద్యులు సోమవారం శేరిగూడలో సమావేశమై తమ పూర్తి మద్దతు మంచిరెడ్డికే ఇస్తున్నట్లు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆ సంఘం రాష్ట్ర నాయకుడు ఉక్కుల అశోక్ మాట్లాడుతూ ఆర్ఎంపీ వైద్యుల సమస్యలపై మంచిరెడ్డి తక్షణమే స్పందించారని ఆయన గెలుపుకోసం తామంతా కృషిచేస్తామన్నారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీకి చెందిన అనేకమంది ఆర్యవైశ్యులు కూడా తుర్కయాంజాల్‌లో సమావేశమై ఈ సందర్భంగా మంచిరెడ్డికే మద్దతు ప్రకటిస్తామంటూ తీర్మానం చేశారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి వారి సమావేశానికి హాజరై ఆర్యవైశ్యులకు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీఇచ్చారు. అలాగే, తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని దాదాపుగా పది కాలనీల అసోసియేషన్ల ఆధ్వర్యంలో సిరిటౌన్‌షిప్‌లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మంచిరెడ్డికే మద్దతు అని ప్రకటించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రమణారెడ్డి, డీసీసీబీ వైస్‌చైర్మన్ సత్తయ్య, నాయకులు పాల్గొన్నారు.